
రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:28 గురువారం
సహర్ 5:06 శుక్రవారం



పరికరాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ యంత్రాలు, పరికరాల కోసం రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ పథకం కింద అందించే ఈ పరికాల కోసం 15లోగా మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పలు రకాల పరికరాలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు.

ప్రాథమిక అంశాలపై

ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్

గంగాధర, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వలస కార్మికుల పిల్లలకు ప్రాథమిక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి చదువు చెప్పాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గంగాధర మండలం గట్టు బూత్కూర్ పాఠశాలలో ఇటుక బట్టీ కార్మికుల పిల్లల కోసం ఏర్పాటు చేసిన పాఠశాలను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ పిల్లలకు ఏం కావాలో వారి మాతృభాషలో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ ట్రాక్ సూట్, బ్యాగులు, షూస్ అందించాలని అక్కడే ఉన్న జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావుకు సూచించారు. ఇంగ్లీష్, గణితం లాంటి ప్రాథమిక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని పల్లె దవాఖాన వైద్యులకు సూచించారు. అనంతరం ఆరో తరగతి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. పాఠశాలలోని కిచెన్ గార్డెన్ సందర్శించి పలు సూచనలందించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్‌రావు, హెచ్ఎం అశోక్‌రెడ్డి, ఎంపీడీవో రాము, పీఎస్ ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు

- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఆందోళనలో అన్నదాతలు



గన్నేరువరం మండలం మైలారంలో ఎండిపోయిన పంట

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మార్చి నెలలోనే ఎండి మండిపోతున్నాయి. భూగర్భజలాలు రోజు రోజుకు పాతాళానికి చేరుకుంటున్నాయి. దీంతో సాగునీరు అందక పంట పొలాలు నెర్రలు వారుతూ ఎండి పోతున్నాయి. జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన రామడుగు, గంగాధర, చిగురుమామిడి, గన్నేరువరం మండలాలతోపాటు చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్, కాట్నపల్లి, సాంబయ్యపల్లి, చిట్యాలపల్లి, మంగళపల్లి గ్రామాల్లో సాగునీరు పంట పొలాలు ఎండిపోతుండడంతో అన్నదాతలు విలవిలాడుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతుండగా కొంత మంది రైతులు పంటపై ఆశలు వదులుకుని పొలాలను పశువుల మేతకు వదిలిపెడుతున్నారు. ఆరుగాలం కష్టించి కంటికి రెప్పలా కాపాడు కుతున్న తరుణంలో కళ్లముందే నీరందక వాడిపోతుండగా రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.



రామడుగు మండలంలో బీటలు వారిన పొలం

పూడిక తీసినా సరిపోని నీరు

రామడుగు మండలంలోని గుండి, గోపాల్‌రావుపేట, గుమ్లాపూర్ తదితర గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటడంతో బావులో పూడిక తీసినా కూడా సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోతె వాగుకు నారాయణపూర్ నీటిని విడుదల చేయడం ఆపివేయడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని అన్నదాతలు విలవిలలాడు తున్నారు. మరో వారం రోజుల్లో నీరు విడుదల చేయక పోతే పంటలు పూర్తిగా ఎండి పోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండిన బావులు, బోర్లు

గన్నేరువరం మండలంలోని మైలారం, హనుమాజీ పల్లి శివారులలో ఇప్పటికే పంట పొలాలు పూర్తిగా ఎండి పోయాయి. డీ-8 ఉపకాల్వ చివరి ఆయకట్టు వరకు నీరందక పంట పొలాలు ఎండి పోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. మరో వైపు భూగర్భజలాలు అడుగంటి పోవడంతో బావుల్లో పూడిక తీస్తూ పంటలను కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని

(మిగతా 8వ పేజీలో)

పూర్తికాని నారాయణపూర్ కుడి కాల్వ

చొప్పదండి నియోజకవర్గానికి నారాయణపూర్ రిజర్వాయర్ సాగునీటి కేంద్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రిజర్వాయర్ నిండా నీరున్నా పంటలకు నీరందని పరిస్థితి నెలకొంది. జలాశయం నుంచి నిర్మిస్తున్న కుడికాలువ ఏళ్ల తరబడి కొనసాగుతుండగా భూములిచ్చిన రైతులు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. గంగాధర మండలంలో గంగాధర, మంగపేట, మధురానగర్, వెంకంపల్లి, కాసారం, ఉప్పరమల్యాల వరకు కుడికాలువ నిర్మాణం చేపట్టారు. ఈ గ్రామాల్లో ఎక్కువగా వరిని సాగు చేయగా గొలక దశలో నీరందక పొలాలు ఎండుతున్నాయి. బోర్లు, బావుల కింద పంటలు సాగు చేస్తుంటారు. బోరుబావులు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటి పోతుండడంతో పంట చేతికొస్తుందో లేదనని ఆందోళన చెందుతున్నారు.

సీపీ గౌస్ ఆలం సుడిగాలి పర్యటన

- ఇంటర్ పరీక్షా కేంద్రాలు, బస్టాండ్, టవర్‌సర్కిల్ సందర్శన
- బస్టాండ్‌లో సీసీ కెమెరాల పనితీరుపై ఆరా...
- కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణపై అధికారులకు సూచనలు



నగరంలో పర్యటిస్తున్న సీపీ ఆలం

కరీంనగర్ క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం బుధవారం కరీంనగర్‌లో సుడిగాలి పర్యటన చేశారు. నగరంలోని ప్రధాన కూడళ్లు టవర్ సర్కిల్, బస్టాండ్, ఇందిరాచౌక్ తదితర ప్రాంతాలను సందర్శించి ట్రాఫిక్ నియంత్రణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇంటర్‌మీడియట్ పరీక్షలు జరుగుతున్నందున పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తీరును అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించారు. ఆర్టీసీ అధికారులతో సమావేశమయ్యారు. బస్టాండ్ ఆవరణలో సీసీ కెమెరాల పనితీరు గురించి తెలుసుకున్నారు. కరీంనగర్ ఒకటో ఠాణా, రెండో ఠాణా, మూడో ఠాణాల పరిధిలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో సీపీ పర్యటించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను, ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో టౌన్ డివిజన్ ఏసీపీ వెంకటస్వామి, ట్రాఫిక్ ఏసీపీ స్వామి, సీఐలు బిల్ల కోటేశ్వర్, జాన్‌రెడ్డి, పర్శ రమేష్, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి

చొప్పదండి: విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీపీ గౌస్ ఆలం అన్నారు. చొప్పదండి పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడి వారికి కేటాయించిన విధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన పద్ధతిలో రికార్డులను నిర్వహించి, నమోదైన కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో పొందుపరచాలన్నారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు పోలీస్ అధికారులను కేటాయించాలని ఆదేశించారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లు, పోలీస్ స్టేషన్‌లో అన్నిరకాల విధులపై అవగాహన పెంచుకోవాలన్నారు. రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, సమన్లు, విధులను సీనియర్ల ద్వారా తెలుసుకోవాలన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించి, ప్రతినెల నూతన సమాచారాన్ని సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, ఎస్ఐ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.



చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ

రైతులకు వరం..

పీఎం కిసాన్ మాన్‌దన్

- 60 ఏళ్లు దాటిన రైతులకు పింఛన్
- 18 నుంచి 40 ఏళ్ల రైతులు అర్హులు
- రూ.55 నుంచి ప్రీమియం

7

వీధి కుక్కల దాడిలో పలువురికి గాయాలు 6

ఆర్టీసీలో బదిలీలు, పదోన్నతులు 7

ఇంటర్ పరీక్షలకు 398 మంది గైర్హాజరు

కరీంనగర్ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ రెడో సంవత్సరం మ్యాథమెటిక్స్, బాటనీ, పొలిటికల్ సైన్స్ పేపర్-2 పరీక్షలకు 398 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బుధవారం నిర్వహించిన ఈపరీక్షలకు జనరల్, వొకేషనల్ విభాగంలో కలిపి 16,256 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా జనరల్ విభాగంలో 318మంది, ఒకేషనల్‌లో 80 మంది హాజరుకాలేదు. జనరల్ విభాగంలో 14,550 మంది, ఒకేషనల్‌లో 1308 మంది మొత్తం 15,858 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 28 కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశాయి.

దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల పంపిణీ

కరీంనగర్ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అలీం కో సంస్థ సహకారంతో జిల్లాలోని భవిత కేంద్రాల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలను కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం పంపిణీ చేశారు. కరీంనగర్ ముకరంపురాలోని భవిత కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని భవిత కేంద్రాల్లో దివ్యాంగుల ఆలనా పాలన చూస్తున్న సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. 108 మంది పిల్లలకు సహాయ ఉపకర ణాలు అవసరమని గుర్తించి వారి కోసం కాలిఫర్, వీల్ చైర్, ట్రై సైకిల్ వంటి ఉపకరణాలను అంద జేశారు. ఏమైనా అవసరాలుంటే తనను సంప్రదించాలని భవిత సిబ్బందికి సూచించారు. కార్యక్ర మంలో ట్రైనీ కలెక్టర్ అజయ్‌యా దవ్, జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రా వు, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, అలీమ్ కో సంస్థ ప్రతినిధులు, భవిత కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవా లని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై మున్సిపల్ కమిషనర్లు, సబ్ రిజిస్ట్రార్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకుందని అన్నారు. ఎఫ్‌టీఎల్, నిషేధించిన సర్వే నంబర్లు మినహా ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించామని అన్నారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నంబర్ ద్వారా లాగిన్ అయి పరిశీలించవచ్చన్నారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఎవరైనా ఈనెల 31వ తేదీలోగా చెల్లిస్తే 25 శాతం రాయితీ ఇస్తారని తెలిపారు. రుసుము చెల్లించిన వారి దరఖాస్తులను అధికారులు పరిశీలించి రెండు రోజుల్లోనే అనుమతి మంజూరు చేస్తారన్నారు. అనధికారిక లే అవుట్లు చేసి అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశముందని వివరించారు. ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలోనూ ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చని అన్నారు. క్రమబద్ధీకరించని భూముల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతి ఇవ్వబోమని తెలిపారు. జిల్లాలో 68,405 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు రాగా 44,437 ఆమోదం పొందాయన్నారు. కార్యదర్శులు, వార్డు అధికారులు, ఎల్‌ఆర్‌ఎస్ రాయితీపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్రమబద్ధీకరణ రుసుము నిర్ణయించిన వారందరికీ సమాచారం చేరేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో సుడా డీటీసీపీవో ఆంజనేయులు, మున్సిపల్ కమిషనర్లు, సబ్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

ముందే గుర్తిస్తే కుష్ఠును నయం చేయొచ్చు

సుభాష్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధిని ముందే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, కుష్ఠు వ్యాధి నివారణ నోడల్ పర్సన్స్‌కు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల చర్మానికి నరాలకు సోకుతుందని తెలిపారు. ఈ క్రిమి మానవ శరీరంలో ప్రవేశించిన తరువాత వ్యాధి నిరోధక శక్తిని అనుసరించి లక్షణాలు బహిర్గతం కావడానికి ఐదు నుంచి ఏడు సంవత్సరాల సమయం పడుతుందన్నారు. లక్షణాలు ముందే గుర్తిస్తే పూర్తి చికిత్స పొంది వ్యాధిని నయం చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధ మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలు కలిగిన వారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కుష్ఠు వ్యాధి అని నిర్ధారిస్తే ఐదు మచ్చలలోపు ఉంటే ఆరు నెలల చికిత్స ఐదు మచ్చలకంటే ఎక్కువ ఉంటే 12 నెలలు చికిత్స తీసుకొని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపును ఈనెల 17 నుంచి 30 వరకు నిర్వహిస్తారని, ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళతారన్నారు. ఏమైనా మచ్చలు ఉన్నట్లైతే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో లెప్రసీ న్యూక్లియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిక్హత్, డీఐవో డాక్టర్ సాజిదాఅతహరి, సర్వేలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అతుల్ నిగమ్, డెమో రాజగోపాల్, డీపీవో స్వామి, హెల్త్ ఎడ్యుకేటర్ కైక పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ

వీధికుక్కల దాడిలో పలువురికి గాయాలు

చొప్పదండి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేటలో బుధవారం వీధికుక్కలు దాడిచేసి నలుగురిని గాయపరిచాయి. దీకొండ లక్ష్మి, లింగమ్మ, సిర్ర రిషిక, దయ్యాల లస్మయ్యపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. బాధితులకు చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమచికిత్స అందించి అనంతరం కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. వీధికుక్కలు ప్రమాదకరంగా తయారయ్యాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

జమ్మికుంటలో యువకులపై..


పిచ్చికుక్క దాడిలో గాయపడిన యువకుడు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కుల గూడెం సమీపంలో గల నాయినిచెరువువద్ద బైక్ పై వెళ్తున్న ముగ్గురు యువ కులను పిచ్చి కుక్కల గుంపు వెంబ డించింది. అందులో ఒకపిచ్చి కుక్క దాడి చేయడంతో యువకుడి కాలికి తీవ్రగాయాల య్యాయి. మోత్కుల గూడెంకు చెందిన బిట్ల రాకేష్ అనే యువకుడు తన ఇద్దరు స్నేహితు లతో కలిసి బైక్‌పై వెళ్తున్నాడు. నాయిని చెరువు సమీపం వద్దకు రాగానే వారిని పిచ్చికుక్కల గుంపు వెంబడించింది. వెనుకాల కూర్చున్న రాకేష్‌పై ఓ పిచ్చికుక్క దాడిచేయడంతో ఎడమ కాలికి తీవ్రగాయాలు అయ్యాయి. స్నేహితులు వెంటనే అతన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు ప్రాథమిక వైద్యం అందించారు.

శంకరపట్నంలో కుక్క, కోతుల దాడి

శంకరపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం కుక్క, కోతులదాడిలో పలువురు గాయపడ్డారు. కేశవపట్నం గ్రామానికి చెందిన స్రవంతి కుక్కదాడిలో గాయపడగా, చింతలపల్లికి చెందిన మల్లారెడ్డి, అంబాలాపూర్‌కు చెందిన మణెమ్మ, మొలంగూర్‌లో జ్యోతిపై కోతులు దాడిచేయడంతో గాయపడ్డారు. కేశవపట్నం పీహెచ్ సీలో గాయపడిన వారు చికిత్స తీసుకున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ తెలిపారు.

గల్ఫ్ పంపిస్తానని మోసగించిన వ్యక్తిపై చీటింగ్ కేసు

జగిత్యాల క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌దేశానికి పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసగించిన ఒకరిపై జగిత్యాల పట్టణ పోలీసులు బుధవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన దేశెట్టి రాకేష్ అనేవ్యక్తి ఉపాధికోసం గల్ఫ్ వెళ్లేందుకు జగిత్యాలకు చెందిన అల్లెపు వెంకటేష్ అనే వ్యక్తికి 2022 సంవత్సరంలో రూ.3.5లక్షల నగదు చెల్లించాడు. 2023 సంవత్సరంలో ఆర్మీనియా దేశానికి వెళ్లిన రాకేష్ కొద్ది నెలలకే అక్కడ ఉపాధి లేక స్వదేశానికి తిరిగి వచ్చాడు. తాను మోసపోయానని తెలుసుకుని గల్ఫ్ దేశానికి పంపించిన వెంకటేష్‌ను డబ్బులు తిరిగిచెల్లించాలని నిలదీశాడు. మరోసారి వెంకటేష్ మాయమాటలు విన్న రాకేష్ 2025 జనవరిలో థాయ్‌లాండ్ వెళ్లాడు. అక్కడ వెంకటేష్‌కు సంబంధించిన వ్యక్తులు రాకేష్‌ను కలిసి బ్యాంకాంగ్ తీసుకవెళ్లి సరైనఉద్యోగం చూపించకుండా ఓ సైబర్‌క్రైమ్ ముఠాకు అప్పజెప్పారు. దీంతో మరోసారి మోసపోయానని తెలుసుకున్న రాకేష్ ఇండియన్ ఎంబసీ సహాయంతో ఇటీవల స్వదేశానికి వచ్చాడు. తనకు జరిగిన మోసంపై రాకేష్ బుధవారం జగిత్యాల పట్టణపోలీసులకు ఫిర్యాదుచేయగా వెంకటేష్‌పైచీటింగ్ కేసునమోదుచేసినట్లు టౌన్‌సీఐవేణుగోపాల్ పేర్కొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

వీణవంక, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామనికి చెందిన దొండపాటి సంపత్‌రెడ్డిపై దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. సంపత్ రెడ్డి, ఇంటి ముందు గేటు నిర్మిస్తుండగా అదేగ్రామానికి చెందిన దొండపాటి భగవాన్ రెడ్డి, దొండపాటి పద్మ నానా భూతులు తిడుతూ పిల్లర్లు పగల గొట్టడంతో పాటు గడ్డపారతో సంపత్‌రెడ్డిపై దాడిచేయగా తలకు గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన బుర్ర వికాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం తాళం పగులగొట్టి న్యూసెన్స్ చేశాడని గ్రామ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు


మల్యాల మండలంలో వ్యవసాయ క్షేత్రాలకు ఏర్పాటు చేసిన రహదారి

జగిత్యాల జిల్లాలో మల్యాల నంబర్‌వన్

సగటున 44.11శాతం కూలీలకు పని

మల్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం మల్యాల మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలుస్తోంది. మండలంలోని 19 గ్రామాల పరిధిలో 10,593 మందికి జాబ్ కార్డులు ఉండగా ప్రస్తుతం 5,642 కూలీలు పని చేస్తున్నారు. కూలీలకు నిత్యం రూ.275 నుంచి రూ.300 వరకు వేతనం లభిస్తుంది. ఇటీవలి కాలంలో మండల వ్యాప్తంగా లక్షా 95వేల112 పని రోజులు పూర్తి కాగా సగటున 44.11శాతం కూలీలకు పని కల్పించారు. రూ.5.21కోట్ల వేతనాలు కూలీలు అందుకున్నారు. ఏడాదిలో 60 రోజులు పనులు పూర్తి చేసుకున్న వారిని ప్రత్యేకంగా గుర్తిస్తూ వంద రోజులు పూర్తి అయ్యేలా ప్రోత్సహిస్తున్నారు. ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా పొలంబాట కార్యక్రమం కింద వ్యవసాయ భూములకు రహదారుల ఏర్పాటు, రైతుల వ్యవసాయ భూముల వద్ద నీటి నిలువ కుంటలు, పశువు పాకలు, చెరువు పూడికతీతలు, ఇంకుడుగుంతలు మామిడి ప్లాంటేషన్ లాంటి పనులు చేపడుతున్నారు.


ఉపాధి పనుల్లో చేపడుతున్న పశువుల పాక నిర్మాణం

కూలీలకు శిక్షణ

2021 నుంచి 2024 వరకు 100 రోజులు పని చేసుకున్న జాబ్‌కార్డు కుటుంబాలలో విద్యార్హతలను బట్టి 18-45 ఏళ్ల లోపు గల 70మందికి అధికారులు ఇటీవల పుట్టగొడుగుల పెంపకం శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌తో పాటు ముద్ర బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు. గతంలోనూ మహిళలకు కుట్టు శిక్షణ, బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్, యువకులకు కంప్యూటర్, ఎలక్ట్రీషన్, ప్లంబింగ్ తదితర శిక్షణ ఇవ్వగా స్వయం ఉపాధి, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగావకాశాలు లభించాయి.

ప్రత్యేక పర్యవేక్షణ:శ్రీనివాస్, ఏపీవో, మల్యాల

ఉపాధిహామీ పనుల్లో జిల్లాలోనే మల్యాల ప్రథమ స్థానంలో నిలుస్తోంది. వంద రోజులకు సమీపంలో గల కూలీలను గుర్తించి వారంతా ఈజీఎస్ పనుల్లో పాల్గొనేలా నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం. కూలీల సంఖ్యను మరింత పెంచడం ద్వారా జిల్లాలో ప్రథమ స్థానాన్ని కొనసాగిస్తాం.

అక్రమంగా కట్టిన ఇల్లు సీజ్

సిరిసిల్ల టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా కట్టిన ఇల్లును బుధవారం దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయకమిషనర్ యన్ సుప్రియ సీజ్ చేయించారు. సిరిసిల్ల పట్టణం శ్రీలక్ష్మి వెంకటేశ్వర దేవాలయానికి చెందిన సర్వే నంబర్ 1578విస్తీర్ణం 1.38గుంటల భూమిలో 40సంవత్సరాల క్రితం అక్రమంగా కట్టి దాదాపు 30పక్కా నివాసగృహాలను దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయకమిషనర్ సుప్రియ పరిశీలించారు. ఇటీవల హైకోర్టుఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి ప్రతిఇంటికి రూ.1000 డ్యామేజ్ సూట్ కింద పేమెంట్ చేయాలని సూచించారు. డ్యామేజ్‌చార్జెస్ కట్టనియెడల నివాసగృహాలను కూడా సీజ్‌చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా కట్టిన ఓనివా సగృహాన్ని సీజ్‌చేయించారు. అనంతరం దేవాలయానికి చెందిన 463సర్వేనంబర్ అండ్611 భూములను పరిశీలించారు.కార్యక్రమంలో ఈవో మారుతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

రాయికల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయానికి సమీపంలో ఉన్న ఆవుల పోషణ నిమిత్తం దాతలు అందజేసిన పశుగ్రాసం దగ్ధమైంది. సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లినట్లు శివసేవకులు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి పశుగ్రాసాన్ని అందజేయాలని కోరారు.

79క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌తో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కోల్‌సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఫైవింక్లయిన్‌లో బుధవారం అక్రమంగా మహారాష్ట్రకు డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్న రేషన్‌బియ్యంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది మాటువేసి వ్యాన్ (టీఎస్02 యూఏ1517)ను పట్టుకుని అందులో 79.5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మంథనికి చెందిన రాచర్ల రమేష్, మహారాష్ట్ర సిర్వంచకు ఎల్లంకి వీరన్‌లు మంథని ప్రాంతం నుంచి రేషన్ బియ్యాన్ని డీసీఎం వ్యాన్‌లో అనుమానం రాకుండా సగానికి లోడ్‌చేసుకుని తరలి స్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. అనుమానం వచ్చి తనిఖీచేయగా రేషన్ బియ్యం పట్టుబడిందన్నారు. దేశెట్టి మారుతి(26) అనే డ్రైవర్‌ను పట్టుకోగా రాచర్ల రమేష్, ఎల్లంకి వీరన్, ఓదెల మహేందర్‌లు పరారీలో ఉన్నారన్నారు. డీసీఎం వ్యాన్ గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

మంథనిరూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచి రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకింద సింగరేణి స్వాధీనం చేసుకున్న సిద్దపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో తనిఖీ చేయగా 106 ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ చేసిన 54.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నాయన్నారు. వీటిని అక్రమంగా నిల్వ చేసిన ఎండీ రియాజ్‌ను విచారించగా తాను రేషన్‌కార్డు దారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిపారన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి రైతు మృతి


శ్రీనివాస్ (ఫైల్)

వెల్గటూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన రైతు సంగ శ్రీనివాస్ (46) మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అడవి పందులు ఢీకొట్టడంతో అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్ వెల్గటూర్ మండలం ముత్తునూర్ నుండి కొండాపూర్ గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. మంగళవారం రాత్రి కెనాల్ ద్వారా వస్తున్న నీటిని తన పొలానికి పెట్టడానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. ఇంటికి తిరిగివస్తున్న క్రమంలో కొండాపూర్ గ్రామశివారులోని తొండం ప్రాంతంలో అడవి పందులు ఢీకొట్టడంతో కిందపడిపోయాడు. తలకు, ఇతరచోట్ల తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బుధవారం మృతుడి కుమారుడు విష్ణువర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


యాదగిరిరావు(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మానేరు బైపాస్‌రోడ్‌లో రాంచంద్రాపూర్ కాలనీ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హనుమాన్‌నగర్‌కు చెందిన వాల యాదగిరిరావు(57) దుర్మరణం చెందాడని కరీంనగర్ రెండోఠాణా పోలీసులు తెలిపారు. బైక్‌పై వెళ్తున్న యాదగిరిరావును వెనుకవైపు నుంచి కారు అతివేగంగా ఢీకొట్టడంతో కారు బ్యానెట్‌పై పడ్డాడు. అనంతరం కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారు, లారీల మధ్య ఇరుకున్న యాదగిరిరావు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య భల్మారి శ్రీలక్ష్మి తిమ్మాపూర్ మండలం పర్లపెల్లిలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తుండగా, కూతురు మెడికల్ విద్యనభ్యసిస్తున్నట్లు సమాచారం. మృతుడి భార్య ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపారు.

రాంనగర్‌లో పట్టపగలే చోరీ

● రూ.4లక్షల నగదు, రెండున్నర తులాల బంగారం అపహరణ

కోరుట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని రాంనగర్‌లో అయిలాపూర్ పద్మరాణి అనే మహిళ ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. పద్మరాణి పట్టణంలోని ఇందిరా రోడ్డులో సారి సెంటర్ నడుపుతోంది. మధ్యాహ్నం ఇంటికి తాళంవేసి దుకాణానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా రూ.4 లక్షల నగదు, రెండున్నర తులాల బంగారు అభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రామచంద్రుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి క్లూజ్ టీం సభ్యులతో తనిఖీలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు మృతి

మెట్‌పల్లి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ లింగంపల్లి వెంకన్న(60) అనే వృద్ధుడు మంగళవారం రాత్రి మృతి చెందినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి బుధవారం తెలిపారు. మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన వెంకన్న ఫిబ్రవరి 25న మెట్‌పల్లిలో పనులు ముగించుకుని ముత్యంపేటకు ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు వేంపేట గ్రామ శివారులో ఢీకొట్టగా వెంకన్నకు తీవ్ర గాయాలపాలయ్యాడు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వెంకన్న మంగళవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


సర్వర్ పాషా (ఫైల్)

బతికెపల్లి గ్రామానికి చెందిన సయ్యద్..

పెగడపల్లి, మార్చి12(ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ సర్వర్ పాషా (55) చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 10న రాత్రి గ్రామంలో నడుచుకుంటూ వెళ్తుండగా కారు ఢీకొనడంతో సయ్యద్ సర్వర్‌పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. కాగా అదేప్రమాదంలో గాయపడ్డ సర్వర్ పాషా సోదరుడు జాకీర్‌పాషా పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు ఎస్‌ఐ రవికిరణ్ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి బలవన్మరణం

ముత్తారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన చొప్పరి శ్రీనివాస్(48) అనేవ్యక్తి ఇంట్లో ఎవరూలేని సమ యంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. శ్రీనివాస్ కొంతకాలంగా అనా రోగ్యంతోపాటు మతిస్థిమితం లేక ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఇంకెన్నాళ్లీ ఎదురు చూపులు

● మూడు దశాబ్దాలుగా ఆర్టీసీలో సేవలు
● పదవీ విరమణ చేసి ఏళ్లు గడిచినా అందని బకాయిలు
● ఆర్టీసీలో రిటైర్డ్ కార్మికుల అరణ్యరోదన
● చనిపోయిన తరువాత ఇస్తారా అని ఆవేదన


డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

కళ్యాణ్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల పాటు వారు ఆర్టీసీలో సేవలందించారు. పదవీ విరణ చేసిన తర్వాత వారికి ఆర్థిక భద్రత లేకుండాపోయింది. ఏళ్లు గడిచినా ఇప్పటి వరకు వారికి రావాల్సిన బకాయిలను యాజమాన్యం చెల్లించకపోవడంతో ఆర్‌టీసీ రిటైర్డ్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1200 మంది రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన బకాయిలను యాజ మాన్యం ఇప్పటి వరకు చెల్లించ లేదు. ఓ కార్మికుడు బకాయిలు వస్తాయో రావోనని మనోవేదనతో మృత్యువాత పడినా యాజమాన్యం స్పందించడం లేదు. గోదావరిఖని ఆర్టీసీ డిపోలో సుమారు వంద మంది పదవీ విరమణ చేయగా బెనిఫిట్స్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

2015 నుంచి ఫిక్సేషన్ అరియర్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఒక్కో కార్మికుడికి ఏడు లక్షల నుంచి 23 లక్షల రూపాయల వరకు రావాల్సి ఉంది. మృతి చెందిన కార్మికులకైనా అరియర్స్ చెల్లించాలని వేడుకున్నా యాజమాన్యం తమను పట్టించుకోవడ లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల 24న ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులు గోదావరిఖని డిపో ఎదుట ఆందోళనకు దిగి తమకు రావాల్సిన అరియర్స్‌ను చెల్లించాలని డిపో మేనేజర్ నాగ భూషణానికి వినతిపత్రం అందించారు. పదవీ విరమణ పొంది ఏడేళనా తమకు రావాల్సిన బకాయిలు రాకపోవడంతో మనోవేదనతో హనుమయ్య అనే డ్రైవర్ మృత్యువాత పడ్డాడు. పలువురు అనారోగ్యానికి గురై జీవితాన్ని గడుపుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు వస్తాయో, రావోనని కలత చెందుతున్నారు. తమ సమస్యలను ఎండీకి విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ కూడా చాలా తక్కువ వస్తుందని, బకాయిలను చెల్లించే విధంగా కృషి చేయాలని వారు అధికారులను కోరుతున్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

చావే శరణ్యం...

నాగేందర్, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు



32ఏళ్లు ఆర్టీసీకి సేవ చేశాం. మాకు రావాల్సిన డబ్బులు ఇవ్వడం లేదు. రిటైర్డ్ అయి ఐదేళ్లు అయినా రూ.23 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. వాటి వడ్డీ కలిపి అరియర్స్‌ను చెల్లించాలి. కుటుంబ పోషణ భారమవుతుంది.

పెన్షన్ కూడా తక్కువే..

కనకయ్య, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు



ఆర్టీసీలో నేను 22ఏళ్లు డ్రైవర్‌గా పని చేశా. పెన్షన్ కూడా తక్కువగానే ఉంది. పెన్షన్ రూ.2500 కూడా రావడం లేదు. దీనికి తోడు ఆర్టీసీ నాకు బెనిఫిట్స్‌ను కూడా ఇవ్వ లేదు. 2013 నుంచి ఆర్‌పీఎస్ బాండ్ బకా యిలు రావడం లేదు. రెగ్యులర్ ఎంప్లాయిస్‌కు నెల రోజుల్లోనే ఫ్రీక్వెన్సీ చేస్తున్నారు. మాకు మాత్రం కాలయాపన చేస్తున్నారు. ఇది సరైంది కాదు.

రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తాం...

తిరుపతి, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు



మాకు రావాల్సిన అరియర్స్ బకాయిలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తాం. ఇప్పటికే పలు డిపోల్లో ఆందోళనలు మొదలయ్యాయి. అవసరమైతే విధుల్లో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లతో కలిసి సమ్మెకు దిగుతాం.

మహిళా అఘోరీ హల్‌చల్..

● జిల్లా సరిహద్దులో రెండు గంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు
● వేములవాడకు వెళ్లే ప్రయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు


మహిళా అఘోరీని తరలిస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళాఅఘోరీ జిల్లా సరిహద్దుల్లో మరోసారి హల్‌చల్ సృష్టించింది. బుధవారం జిల్లా సరిహద్దులోని తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామశివారులో మహిళాఅఘోరీని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. గతంలో వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న సందర్భంలో దేవస్థానం ప్రాంగణంలో ఉన్నదర్గాను కూల్చివేస్తానని సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈక్రమంలో గతనెల ఫిబ్రవరి18న కూల్చివేయడానికి రావడంతో ముందస్తుగానే జిల్లాసరిహద్దులో మహిళా అఘోరీని అడ్డుకొని సిద్దిపేటకు తరలించారు. మరోసారి వేములవాడకు మహిళా అఘోరీ వస్తుందని సమాచారంతో జిల్లాసరిహద్దులో భారీగా పోలీసులను మోహరించారు. సిద్దిపేట-సిరిసిల్ల ప్రధానరహదారిపై జిల్లెల్ల వద్ద 50మంది పోలీసులతో ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీచేశారు. మధ్యాహ్నం నుంచే పోలీస్ చర్యలు మొదలవగా సాయంత్రం 5 గంటల ప్రాంతంలో జిల్లాసరిహద్దుకు మహిళా అఘోరీ వాహనం చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. కారులోంచి దిగకుండా పోలీసులపై పరుష పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ హల్‌చల్ చేసింది. తనను అడ్డుకుంటే కత్తితో చేతిని కోసుకుంటానని బెదిరించింది. దీంతో మహిళా పోలీసులు మహిళా అఘోరీని బలవంతంగా కారులోంచి దింపి శరీరంపై దుప్పటి కప్పారు. అనంతరం మహిళా అఘోరీని పోలీస్ వాహనంలో సిద్దిపేటకు తరలించారు. కారును టోషన్ సహాయంతో సిద్దిపేట వైపు తీసుకెళ్లారు. సీఐలు శ్రీనివాస్‌గౌడ్, సదన్ కుమార్, ఎస్‌ఐలతో భారీ బందోబస్తులో నిర్వహించారు.

కేజీబీవీ పాఠశాల విద్యార్థినికి గాయాలు

తిమ్మాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల(కేజీబీవీ)లో 10వ తరగతి చదువుతున్న మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లికి చెందిన అనన్య ప్రమాదవశాత్తు గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం పాఠశాలలో బుధవారం రాత్రి విద్యార్థినుల మధ్య ఘర్షణ జరిగింది. పెనుగులాటలో అనన్యకు కిందపడగా గాయాలయ్యాయి. వెంటనే పాఠశాల సిబ్బంది అనన్యను అసుపత్రికి తరలించగా చేయి విరిగినట్లు గుర్తించారు. అసలు ఏం జరిగిందనే దానిపై అధికారులను తెలుసుకునే ప్రయత్నం చేయగా వారు స్పందిచలేదు.

రాజన్న ఆలయంలో
కామ దహన ఉత్సవం



కామదహనం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

వేములవాడ కల్చరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కామదహన ఉత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. రాజన్న ఆలయ ఆవరణలో రాత్రి ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి కామ దహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా రాజన్న ఆలయ మండపంలో డోలోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి




పెగడపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా ఎంపీడీవోలు, మండల పరిషత్ ఉద్యోగులు అభినందించారు.

రైతులకు వరం
పీఎం కిసాన్ మన్‌ధన్

- 60 ఏళ్లు దాటిన రైతులకు పింఛన్
- 18 నుంచి 40 ఏళ్ల రైతులు అర్హులు
- రూ.55 నుంచి ప్రీమియం

చొప్పదండి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం రైతులకు వరంగా మారనుంది. రైతులు వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం చేయకున్నా వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన' పథకాన్ని తీసుకువచ్చింది. వృద్ధాప్యంలోకి వచ్చాక చాలా మంది రైతులకు ఎలాంటి ఆదాయ వనరులు ఉండవు. ఈ నేపథ్యంలో వయస్సు పైబడిన చిన్న, సన్న కారు రైతులకు అండగా ఉండేందుకు కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద 60 ఏళ్లు నిండాక రైతులకు ప్రతి నెల 3 వేల రూపాయల చొప్పున పింఛన్ జీవిత కాలం అందుతుంది. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న రైతులు ఈ పథకంలో చేరేందుకు అర్హులు. భూ రికార్డుల్లో తమ పేరు ఉం డి, రెండు హెక్టార్ల వరకు సాగు చేసేందుకు వీలుగా భూమి ఉన్నవారు ఈ పథకం కింద పేర్లు నమోదు చేసు కోచ్చు. ఎప్పుడు నమోదు చేసుకున్నా పెన్షన్ 60 ఏళ్లు దాటాకే వస్తుంది. నేషనల్ పెన్షన్ స్కీం, ఈఎస్ఐ స్కీం, ఈపీఎఫ్‌వో పరిధిలో ఉన్నవారు, ఏదైనా ఇతర చట్టబద్ధ సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఉన్న వారు, ఉన్నత ఆర్థిక స్థితి కలిగినవారు, టాక్స్ పేయర్లు ఈ పథకానికి అర్హులు కాదు. ఈ పెన్షన్ అందే వరకు రైతులు కొంత ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పథకంలో చేరే వారి వయస్సును బట్టి ప్రీమియం ఉంటుంది. రైతు చెల్లించినంతే ప్రభుత్వం కూడా తన వంతుగా బీమా కంపెనీకి నగదు జమ చేస్తుంది.



ప్రీమియం వివరాలు

18 నుంచి 40 సంవత్సరాల వయస్సులోపు రైతులు ఈ పథకానికి అర్హులు. ప్రతి నెల 55 రూపాయల నుంచి 200 రూపాయల వరకు ప్రీమియంను బ్యాంక్ ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుంది. రైతు చెల్లించిన ప్రీమియం మొత్తానికి కేంద్ర ప్రభుత్వం సమానంగా చెల్లిస్తుంది. రైతు 55 రూపాయలు జమ చేస్తే ప్రతి నెల 110 రూపాయలు జమ అవుతుంది. 20 ఏళ్ల వయస్సు గల రైతులు 61 రూపాయల ప్రీమియం, 25 ఏళ్ల వారికి 80, 30 ఏళ్లకు 105, 35 ఏళ్లకు 150, 40 ఏళ్ల వయస్సు వారికి ప్రీమియం 200 రూపాయలుగా ఉంటుంది. రైతు మరణిస్తే భార్య ఈ పథకాన్ని కొనసాగించవచ్చు. 60 ఏళ్ల తరువాత రైతు మరణిస్తే భార్యకు 1500 రూపాయల పెన్షన్ వస్తుంది. రైతు ఫోటో, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్, వయస్సు నిర్ధారణ, సాగు భూమి, ఆదాయం వంటి వివరాలను, పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. కాగా ఈ కిసాన్ మాన్‌దన్ పదకంలో చేరాలంచే కామన్ సర్వీస్ సెంటర్లలో రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.



దరఖాస్తు చేసుకోవడం ఇలా

- పీఎం కిసాన్ లబ్ధిదారులు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లో పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- రైతు మొదట తన ఆధార్ నంబర్ ఎంటర్ చేయాలి.
- పీఎం కిసాన్ పథకానికి నమోదైన బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులను చెల్లించాలి. ప్రతి నెల ఆటోమెటిక్‌గా డబ్బులు ఖాతా నుంచి పథకానికి జమ అవుతాయి.
- నామినీ వివరాలను నమోదు చేయాలి.
- మాన్‌ధన్ దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని రైతు సంతకం చేసి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలి.
- వెంటనే మీకు పీఎం కిసాన్ మాన్‌ధన్ పింఛన్ కార్డు జనరేట్ అవుతుంది. కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ప్రతి నెలా బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులు పీఎం. కేఎంవై పథకానికి ఆటోమేటిక్‌గా జమ అవుతాయి.
- పీఎం కిసాన్ లబ్ధిదారులు కానట్లయితే సీఎస్‌సీలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకొని పింఛన్ కార్డును డౌన్‌లోడ్ చేసకోవచ్చు.
- ప్రీమియం డబ్బును నగదు రూపంలో చెల్లించాలి. ఆ తరువాత బ్యాంక్ ఖాతాను జత చేసుకోవాలి.

ఆర్టీసీలో బదిలీలు, పదోన్నతులు

భగత్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగులకు పదోన్నతితోపాటు, బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఈ మేరకు బుధవారం బస్ బస్‌భవన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కరీంనగర్-2 డిపో మేనేజర్‌గా పని చేస్తున్న విమలయ్యకు ఖమ్మం డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా పదోన్నతి కల్పించారు. బోధన డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎం. శ్రీనివాస్‌ను కరీంనగర్ డపో-2 మేనేజర్‌గా బదిలీచేశారు. జగిత్యాల డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న జి.సునీతను గద్వాల్ డిపో మేనేజర్‌గా, ఆదిలాబాద్ డిపో మేనేజర్ కె, కల్పనను జగిత్యాలడిపో మేనేజర్‌గా, హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లును కుషాయిగూడకు బదిలీ చేశారు. దిల్‌సుక్ నగర్‌లో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఎస్.వెంకన్నను హుస్నాబాద్ డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. హైదరాబాద్ సీవోఎస్‌గా పనిచేస్తున్న పీవీ రావును కరీంనగర్ డిప్యూటీ ఆర్ఎంగా బదిలీ చేసినట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

చదువుతున్న కాలేజీలోనే గంజాయి అమ్మకం

విద్యార్థి అరెస్టు.. 1.30 కిలోల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చదువుతున్న కాలేజీలోనే గంజాయి విక్రయిస్తున్న విద్యార్థిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 1.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రాంతానికి చెందిన రాజు ఘట్‌కేసర్‌లోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గంజాయి సేవించడానికి అలవాటు పడిన అతడు అధిక ఆదాయం కోసం బీదర్ నుంచి గంజాయి తీసుకొచ్చి తాను చదువుతున్న కాలేజీలో విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందం రాజును అరెస్ట్ చేసింది. నిందితుడి నుంచి 1.30 కిలోల గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ

- గోదావరి నదిలో పుణ్య స్నానాలు
- స్వామి వారల సేవ ఊరేగింపు



స్వామివారల ఊరేగింపు

ధర్మపురి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో బుధవారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. రాత్రి వేళలో శ్రీ స్వామి లక్ష్మీ నరసింహ (యోగ, ఉగ్ర) స్వామి వారల సేవలను ఆశ్వ వాహనంపై ఊరేగింపు జరిపారు. స్వామి వారల సేవలు పుర వీధుల గుండా ఇసుక స్తంభం వద్దకు తీసుకు వచ్చి ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ వేద మంత్రాల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం పక్షాన రైస్‌మిల్ యజమానులు, దాతల సహకారంతో 7 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు జక్కు రవీందర్ సేవలు అందించారు. కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి రంగ శంకరయ్య, సత్రం కోశాధికారి జక్కు దేవేందర్ పాల్గొన్నారు.

రెండో రోజు ఆదాయం రూ.5,14,052

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి బుధవారం రూ.5,14,052 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందులో స్వామి వారల వివిధ రకాల పూజల టికెట్ల విక్రయం ద్వారా 2,76,482, ప్రసాదాలు విక్రయం ద్వారా రూ 1,61,850 లభించగా, అన్నదానం కోసం భక్తులు, దాతల ద్వారా సేకరించిన రూ 75,720 విరాళాలు ఉన్నట్లు ఆయన వివరించారు.



చలవ పందిళ్ల కింద సేద తీరుతున్న భక్తులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి 7 గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామి ఊరేగింపు సేవ ఉంటుంది. శేషప్ప కళావేదికపై రాత్రి స్థానిక కళాకారుడు గుండి జగదీశ్వర్‌శర్మ బృందంచే భక్తి సంగీత విభావరి తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

ధర్మపురి లక్ష్మీ నృసింహస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి నియామకం

ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయ 13 మంది సభ్యులతో కూడిన ధర్మకర్తల మండలిని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేవాలయ కమిటీ సభ్యులుగా ఎదులపురం మహేందర్, బాదినేని వెంకటేశ్, బొల్లారపు పోచన్న, గుడ్ల రవీందర్, జక్కు రవీందర్, కొమురవల్లి పవన్ కుమార్, మందుల్ల మల్లేశ్, నేదునూరి శ్రీధర్, రాపర్తి సాయికిరణ్, సంబెట తిరుపతి, స్తంబంకాడి గణేష్ కుమార్, వొజ్జల సౌజన్య, అవ్వ సుధాకర్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నేరేళ్ల శ్రీనివాసా చార్యులను ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నియమిస్తూ ఆదేశాలు వచ్చాయి.





స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న అర్చకులు, స్వామివారి దర్శనం కోసం ఆలయం బయట బారులు తీరిన భక్తులు

వైభవంగా పూర్ణాహుతి

కొండగట్టులో ముగిసిన పవిత్రోత్సవాలు



పూర్ణహూతి నిర్వహిస్తున్న వేదపండితులు

మల్యాల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో బుధవారం పూర్ణాహుతి వైభవంగా జరిగింది. మూడు రోజులుగా కొనసాగుతున్న పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిసాయి. స్వామి వారికి క్షీరాభిషేకం, సహస్ర నాగవల్లిదళ అర్చన, పట్టు వస్త్రాలంకరణ, దివ్య ప్రబంధ పారాయణం, హవనం, పూర్ణాహుతి, దేవతా ఉద్వాసనం, శ్రీ స్వామి వారికి పవిత్రధారణ, మహదాశీర్వచనం, పండిత సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో పవిత్ర ప్రధానం, సహస్ర దీపాలంకరణ, గరుడ వాహన సేవ కార్యక్రమాలు అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్ రావు, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్, రఘు ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, ఉపప్రధానర్చకులు చిరంజీవి, మారుతీ, సిబ్బంది అశోక్, చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పవిత్రల ఆలయ ప్రవేశం

సైలెంట్‌గా ఎటాక్

- పెరుగుతున్న కిడ్నీ బాధితులు
- ఆరోగ్యంగా జీవించడానికి మూత్రపిండాలు ప్రధాన పాత్రే..
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం




(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కిడ్నీ జబ్బు మనుషులపై సైలెంట్ ఎటాక్ చేస్తుంది. ఎక్కువ శాతం బాధితులు ముందుగా లక్షణాలను గుర్తించకపోవడంతో కిడ్నీ ఫెయిల్‌కి కారణం అవుతుంది. కిడ్నీ సమస్యలు పెరిగిపోతున్న క్రమంలో ప్రపంచ కిడ్నీ ఫెడరేషన్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ అనే రెండు సంస్థలు కిడ్నీలపై అవగాహన కల్పించాలని ప్రతి సంవత్సరం మార్చి రెండవ గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఒక అంశాన్ని తీసుకోని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ సంవత్సరం ముందస్తుగానే సమస్యను గుర్తించి నివారణ - సంరక్షణ అంశంగా ముందుక తీసుకువచ్చింది. చిక్కుడు గింజల ఆకారంలో.. పిడికిలి ప్రమాణంలో.. నడుముకు పైభాగంలో.. పక్కటెముకల కింద మన శరీరానికి రెండు వైపులా ఉండే మూత్రపిండాలు(కిడ్నీలు) ఆరోగ్యంగా జీవించడానికి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రతి రోజూ లీటర్ల కొద్దీ రక్తాన్ని శుద్ధి చేస్తూ, వ్యర్థ పదార్థాలను బయటకు పంపుతూ నిరంతరం పని చేస్తూనే ఉంటాయి. ఆహారపు అలవాట్లు, ఇతర కారణాలతో ఇప్పుడు ఎంతో మంది కిడ్నీల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.

మూత్రపిండాల పనితీరు..

ప్రతి రోజూ కిడ్నీలు రెండువందల లీటర్ల రక్తాన్ని శుద్ధి చేసి రెండు లీటర్ల మలినాలను, అధికంగా ఉన్న నీటిని తీసివేస్తాయి. అలా ప్రతిరోజూ మూత్రపిండంలో 24 గంటలు బొట్లు బొట్లుగా నీరు మూత్రపిండాల్లో ఉత్పత్తి అవుతూనే ఉంటుంది. యురేటర్ అనే రెండు గొట్టాల ద్వారా మూత్రాశయానికి చేరుతుంది. ఈ సంచి నిండగానే మూత్ర విసర్జన చేసుకోవాలని మెదడులో ఆలోచన కలుగుతుంది. తినే ఆహారంలోని రక్త ప్రవాహం కలిసినప్పుడు అనవసరమైన పదార్థాలు కొన్ని రక్తంలో చేరుతాయి. అలా చేరిన మలినాలను మూత్రపిండాలు సత్వరం శరీరం నుంచి బహిష్కరించకపోతే విషపూరితం అవుతాయి. ఈ పనిని కిడ్నీలు చేస్తాయి.



మూత్రపిండాలకు హాని కలిగించే పరిస్థితులు..


మూత్రపిండాలు ప్రాణాపాయ స్థితికి కూడా చేరుకుంటాయి. దెబ్బలు తగలడం, మితిమీరిన రక్తపోటు, అధిక బ్లడ్‌షుగర్, కొన్ని రోగాలకు వాడే మందుల వల్ల మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటుంది. మంచి అలవాట్లు వీటిని నియంత్రిస్తాయి. బరువును అదుపులో పెట్టుకోవడం, పొగతాగడం మానటం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

కిడ్నీల్లో రాళ్లు..

కిడ్నీల్లో రాళ్ల తయారు కావడానికి ప్రధానంగా తినే ఆహారంలో కాల్షియం సాల్ట్స్, యూరిక్ యాసిడ్, ఆక్జలైట్, సిస్టిన్ మొదలైన పదార్థాలు ఎక్కువగా ఉండడం. మూత్రం మండలంలో లోపలి పొర దెబ్బతినడం, ఏ విటమిన్ లోపించడం, మూత్ర విసర్జనకు అవరోధం ఏర్పడడం, మూత్రమండలంలో ఇన్‌ఫెక్షన్స్ రావడం, మంచినీళ్లు తక్కువ తాగడం, ప్రొస్టేట్ గ్రంథి వాయడం జరుగుతుంది. రాళ్లు ఎక్కడున్నాయి అనే దాన్ని బట్టి లక్షణాలు వస్తాయి.

జాగ్రత్తలు పాటించాలి..

ముందుగా జబ్బు నిర్ధారణ చేసుకుని అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే ద్వారా కూడా తెలుసుకోవచ్చు. చిన్నరాళ్లయితే కొంత కాలానికి వాటంతట అవే పోతాయి. అందుకోసం అధిక నీళ్లు తాగితే సరిపోతుంది. రాళ్లు ఉన్నాయని నిర్ధారణ తరువాత ఎక్కువ నీళ్లు తాగాలి. నొప్పి తగ్గడానికి పెయిన్ కిల్లర్స్ మాత్రలు, చీము కణాలుంటే యాంటీబయాటిక్స్ వాడాలి. చిన్న రాళ్లయితే మూత్రంలో పడిపోతాయి, పెద్దగా ఉంటే మూత్రపిండాలు చెడిపోకముందే సర్జరీ ద్వారా తీయించుకోవాలి. ఒకసారి రాళ్లు తీయించుకుంటే మళ్లీ రావని అనుకోవద్దు.



అన్ని రంగాల్లో డిజిటల్ పరివర్తన

గణేశ్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో మార్పునకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిజిటల్ పరివర్తన అన్ని రంగాల్లో స్థిరమైన స్థానాన్ని సాధిస్తోందని శాతావాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ అన్నారు. 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఏకీ క్యాటలిస్ట్ ఫర్ సస్టైనబుల్ బిజినెస్ డెవలప్‌మెంట్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కొవిడ్ తర్వాత ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ వ్యాపారాలు పెరిగాయని, మారుమూల గ్రామాల్లోనూ డిజిటల్ లావాదేవీలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో ఇలాంటి సమాకాలిన అంశాలపై సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గుప్తా లక్ష్మణ్ సెక్రెటరీ ఏబీఆర్ఎస్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి పథంలో నడవడానికి విద్య ముఖ్యమైన సాధనమని, విద్యా రంగంలో సమూలమైన మార్పులు తేవడానికి ఆధునికతతో కూడిన అంశాలను జోడిస్తూ విద్యారంగాన్ని బలోపేతం చేయడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. విశ్వేశ్వరరెడ్డి కలవల గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్, ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి డైరెక్టర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ హైదరాబాద్, డాక్టర్ రవి జాస్పర్ ఇండస్ట్రీస్, విశ్వావిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ పాల్గొన్నారు.

రైతుల నిరసనలను పట్టించుకోని ప్రభుత్వం..



రిలే నిరాహారదీక్షలో మహిళా రైతులు

ఇల్లంతకుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సమస్య పరిష్కరించాలని రైతులు నిరసనలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మహిళా రైతులు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 11వ ప్యాకేజీలో భాగంగా ఎల్ఎమ్ 6 కెనాల్ పనులు పూర్తిచేయాలని పెద్ద లింగాపూర్ గ్రామసమీపంలో రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష బుధవారం 10వ రోజుకు చేరుకోగా దీక్షలో మహిళా రైతులు కూర్చున్నారు. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేస్తే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కెనాల్ పనులు పూర్తిచేసి సాగు నీరు ఇవ్వాలని నిరసన చేపట్టినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రెండు మండలాల రైతుల దీక్షలు చేస్తున్నా ఎమ్మెల్యేలు రాకపోవడం బాధాకరం అన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. మహిళా రైతుల దీక్షకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గన్నారం నర్సయ్య సంఘీబావం ప్రకటించారు.

పెరుగుతున్న ఎండ తీవ్రత





నిర్మానుష్యంగా బస్టాండ్ ఏరియా

రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతోంది. ఈసారి మార్చి ఆరంభంలోనే పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ప్రస్తుతం సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నాయి. దీంతో మధ్యాహ్నం రహదారులపై జనం రద్దీ తగ్గుతోంది. వివిధ అవసరాల నిమిత్తం బయటకు వచ్చినా ఎండ వేడి నుంచి తట్టుకోవడానికి జాగ్రతలు పాటిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్, కరీంనగర్



ఎండుతున్న పంటలు

(5వ పేజీ తరువాయి)

చివరిఆయకట్టు ప్రాంతాలైన చర్లబూత్కూర్, నల్లగుంటపల్లి, చేగుర్తి, మొగ్దుంపూర్, చామన్‌పల్లి గ్రామాల్లో ఇప్పుడిప్పుడే పంట పొలాలు ఎండి పోతుండగా, ఈ ఎండల తీవ్రత ఇదే విధంగా ఉంటే దాదాపు 600 ఎకరాల్లో పంటలు ఎండి పోతాయని రైతులు చెబుతున్నారు. చిగురుమామిడి, తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల్లోని కొన్ని గ్రామాల్లో రైతులు వరిసాగుపై ఆశలు వదులుకుంటున్నారు. బావులు, బోరుబావుల్లో నీరు అడుగంటి సాగుకు సరిపడా అందడం లేదని, ఇప్పటికే పొలం ఎండి పోయిందని, ఇదే పరిస్థితి ఉంటే పంటలు పూర్తిగా ఎండి పోతాయని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వాతావరణశాఖ ఎండలు మరో ఐదు రోజులపాటు పెరిగే అవకాశాలున్నాయంటూ రెడ్ అలర్ట్ ప్రకటించడంతో వరి, మొక్కజొన్న సాగు చేసిన రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

ఉచిత సర్వీస్ అభినందనీయం



సేవలను వినియోగించుకుంటున్న వినియోగదారులు

కరీంనగర్ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల కోసం క్రాంప్టన్ గ్రీవెన్స్ కన్జూమర్ ఎలక్ట్రికల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఉచిత సర్వీస్ నిర్వహించడం అభినందనీయమని పలువురు వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక బోయివాడ చౌరస్తా, మంకమ్మతోటలో మంగళ, బుధవారాల్లో ఆ కంపెనీ ఫ్యాన్లు, గీజర్లు, మిక్సీలు, ఐరన్‌బాక్సులు, మోటారు పంపుసెట్ల వంటి పరికరాలకు ఉచిత సర్వీసింగ్ కల్పించారు. సూరజ్ అండ్ కంపెనీ, సాయి ట్రేడర్స్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు.

ఇన్ఫోసిస్‌కు ఎంపికైన అక్షయ కళాశాల విద్యార్థిని



విద్యార్థిని అభినందిస్తున్న అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల చైర్మన్ వి.రవీందర్‌రెడ్డి

భగత్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అక్షయ కళాశాలకు చెందిన సంగ సుజాత అనే తృతీయ సంవత్సరం విద్యార్థిని ఇన్ఫోసిస్ సంస్థకు ఎంపికైంది. బుధవారం కళాశాల ఆవర ణలో కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్‌రెడ్డి ఆమెను అభినందించారు. ఇన్ఫోసిస్ కంపెనీ జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ ఫర్ గ్రాడ్యుయేట్స్ 2025 పరీక్షలో సిస్టమ్ అసోసియేట్ ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు. ప్రిన్సి పాల్, వైస్‌ప్రిన్సిపాల్, టీపీవో టాస్క్ జిల్లా సమన్వయ కర్త ఎ.గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాగేశ్వరిలో హెల్త్, స్పోర్ట్స్ క్లబ్‌ల ప్రారంభం

గణేశ్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వాగేశ్వరీ డిగ్రీ, ఉమెన్స్ కళాశాలల్లో హెల్త్, స్పోర్ట్స్ క్లబ్‌లను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థి దశనుంచే ఇలాంటి క్లబ్‌లను నిర్వహించడం అభినందీయమని అన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, కళాశాల కరస్పాండెంట్ బీవీఆర్ గోపాల్ రెడ్డి, బుర్ర మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రత్నగోపాల్‌రెడ్డి ప్రిన్సిపాల్ లింగమూర్తి, సతీష్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అన్‌క్లైమ్డ్ వాహనాల బహిరంగ వేలానికి నిర్ణయం

కరీంనగర్ క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో పలు కంపెనీలకు చెందిన 58 క్లైమ్ చేయని వాహనాలు దీర్ఘకాలంగా ఉన్నాయని, వాటికి బహిరంగ వేలం నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం బుధవారం ఒక ప్రటకనలో తెలిపారు. వాహనాలపై అభ్యంతరాలు ఉంటే పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేయవచ్చని పేర్కొన్నారు. వివరాల కోసం కరీంనగర్ ట్రాఫిక్ సీఐ పర్శ రమేష్ 8712670758 నంబరులోగానీ, కరీంనగర్ పోలీస్ వెబ్‌సైట్‌లోగానీ సంప్రదించాలని సూచించారు.

● న్యూస్ బాక్స్

విద్యారంగానికి 15% నిధులు కేటాయించాలి

గణేశ్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసల విష్ణు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విశ్వవిద్యాలయాల బడ్జెట్ మేరకు బ్లాక్ గ్రాంట్ కేటాయించాలని పేర్కొన్నారు.

ఎక్స్‌గ్రేషియా కోసం వివరాలు నమోదు చేసుకోవాలి

కరీంనగర్ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగాల్లో పని చేస్తూ, ఈశ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకొని ప్రమాదవశాత్తు చనిపోయిన, శాశ్వత అంగవైకల్యం పొందిన అసంఘటిత రంగ కార్మికులకు, కేంద్రకార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నట్లు జిల్లా ఉపకార్మిక కమిషనర్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి సురక్షయోజన కింద 2021, ఆగస్టు 26 నుంచి 2022 మార్చి 31 మధ్యకాలంలో ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకొని ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుడి నామినీకి రూ.2లక్షలు, అంగ వైకల్యం పొందిన కార్మికులకు రూ.లక్ష అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28 సాయంత్రం 5 గంటలలోపు నగరంలోని పొన్నం కాంప్లెక్స్ ఉప కార్మికశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

గొర్రెలు, మేకల మందులకు నిధులు కేటాయించాలి

సుభాష్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గొర్రెలు, మేకల సంఖ్య ప్రకారం మందుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని యాదవ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి సందబోయిన ప్రసాద్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గొర్రెలు మేకల పెంపకందారుల సమస్యలు చెప్పుకోవడానికి పశుసం వర్ధక శాఖ మంత్రిని, షీప్ అండ్ గోట్ ఫెడరేషన్ చైర్మన్‌ను నియమించాలని కోరారు.

పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రత, శ్రద్ధతో చదివి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ పమేలా సత్పతి విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు బాలాజీ అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలాజీ సేవా సమితి ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని 20 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 700 మంది పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందించడం అభినందనీయమని, విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలోనూ ఈ సేవలు అమలు చేయాలని సేవా సమితి సభ్యులను కోరారు. డీఈవో జనార్దన్‌రావు, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, బాలాజీ సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మార్చి12 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్ ఏడీఈ, శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదర్శనగర్, మంచిర్యాల చౌరస్తా, వావిలాల రాంరెడ్డి నగర్, బుట్టి రాజారాం కాలనీ, సుభాష్ నగర్ అంబేద్కర్‌నగర్, కిసాన్‌నగర్, శివాజీ నగర్, ఎస్టీ కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

సీపీని కలిసిన బీజేపీ నాయకురాలు

కరీంనగర్ క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలంను బీజేపీ మహిళా మోర్చా మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అమ్ము స్వచ్ఛంద సంస్థ అధినేత పి.సుజాత రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

భగత్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ రాజరాజేశ్వర్ డిస్ట్రిక్ నెంబర్ 320, కొత్తపల్లి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బండ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కొత్తపల్లిలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. రేకుర్తి కంటి ఆసుపత్రి, మంకమ్మతోట లయన్స్ క్లబ్ సహకారంతో కొత్తపల్లి వార్డు కార్యా లయంలో 300 మందికి కంటి పరీక్షలు చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు బూర్ల విద్యాసాగర్, అంబటి రవీందర్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సదస్సుకు స్పందన



సదస్సులో సమస్యలు వింటున్న అధికారులు

గణేశ్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ముగ్దుంపూర్ ఆవరణలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలచారి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సదస్సుకు స్పందన లభించింది. సదస్సులో కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని తీగలగుట్టపల్లి, బొమ్మకల్, కొత్తపల్లి, ఆసిఫ్‌నగర్, ముగ్దుంపూర్ సెక్షన్‌లోని విద్యుత్ వినియోగదారులు సమస్యలను విన్నవించారు. కొందరి సమస్యలను చైర్మన్ అక్కడికక్కడే పరిష్కరించారు. సీజీఆర్ఎఫ్ మెంబర్ ఆర్.చరణ్ దాస్, పర్యవేక్షక ఇంజినీర్ రమేష్ బాబు, డివిజనల్ ఇంజినీర్ జంపాల రాజం, ఎస్ఏవో రాజేంద్రప్రసాద్, ఏడీఈ ఆపరేషన్, రూరల్, గాదం రఘు, ఏఈ నరేష్, అనిల్ కుమార్‌చ చంద్రశేఖర్ నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ నోటిఫికేషన్‌కు వర్గీకరణ వర్తింపజేయాలి

సుభాష్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి ప్రతీ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణ వర్తింపజేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు, ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరాహార దీక్ష కొనసాగుతోంది. ఈ సందర్భంగా బుధవారం దీక్ష శిబిరం వద్ద ఆయన మాట్లాడారు. గత ఉద్యోగనోటిఫికేషన్లకు వర్గీకరణ వర్తింపజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 1న అసెంబ్లీలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో బోయిని కొమురయ్య, దండు అంజయ్య, తడగొండ శంకర్, రేపాక బాబు, నక్క లక్ష్మణ్, అంబాల మధునయ్య, నక్క మల్లేశం, దండు వరలక్ష్మి, మల్యాల గౌతమ్, ఎల్కపెల్లి పోలు, కొరటపెల్లి లక్ష్మణ్, క్యాదాసి రాజు, సంపతి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి : ఎస్సీ వర్గీకరణ అమల్యే వరకు గ్రూపు పరీక్షల ఫలితాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు సాంబార్ కొమురయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ ఎస్సీవర్గీకరణ అమలు చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బాబు, జిల్లా కార్యదర్శి మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్/సైదాపూర్/శంకరపట్నం/మానకొండూర్: పట్టణంలో, మండలాల్లో తహసీల్దార్ కార్యాల యాల ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం నిరసన దీక్షచేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ పూర్తి చేసేంత వరకు ప్రభుత్వఉద్యోగాల నియామకాలు నిలిపి వేయాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1, గ్రూప్-2 తదితర నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మురుగు కాల్వ నిర్మాణానికి ముందడుగు

- ● డ్రెయినేజీ నుంచి రోడ్డుపైకి వచ్చిన మురుగునీరు
- ● తక్షణమే మురుగు కాల్వ నిర్మాణం చేపట్టిన కమిషనర్



రోడ్డుపై నిలిచిన మురుగునీటిని వెళ్లేలా చేస్తున్న సిబ్బంది



కాలువ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

హుజూరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నోఏళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న డీసీఎంఎస్ కాంప్లెక్స్ మురుగుకాలువ నిర్మాణానికి ఎట్టకేలకు శాశ్వతపరిష్కారం లభించింది. మున్సిపల్‌కమిషనర్ సమ్మయ్య స్పందించి మురుగుకాలువ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని విద్యానగర్‌లో 20ఏళ్లక్రితం నిర్మించిన మురికికాలువ మరమ్మతులకు నోచుకోలేదు. కాలువ చిన్నది కావడంతో చెత్తాచెదారం తట్టి రోడ్డుపైనే నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం కూడా మురుగునీరు రోడ్డుపైకి రావడంతో మున్సిపల్‌కమిషనర్ సమ్మయ్య, ఇంజనీరింగ్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ఎక్స్‌కావేటర్‌తో మురుగు కాలువ నిర్మాణానికి పునాది తీశారు. రూ.5లక్షల నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించారు. దీంతో డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లోని దుకాణాదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వృథాగా పోతున్న ఎల్లంపల్లి నీరు



పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

రామడుగు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామశివారులో నుంచి పోతున్న ఎల్లంపల్లి పైప్‌లైన్ నీరు వృథాగా పోతోంది. ఎల్లంపల్లి నుంచి నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటి సరఫరా కొనసాగుతుండగా, గోపాల్‌రావుపేట శివారులో అధికారుల నిర్లక్ష్యంతో లక్షలాది లీటర్ల నీరు రోజూ వృథాగా పోతోంది. పక్కనే పంట పొలాలు చుక్క నీరులేక ఎండిపోతుండగా, ఇలా నీరు వృథాగా పోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కనేఉన్న గుండి చెరువుకు గేట్‌వాల్‌కు ఓపెన్‌చేసి అందులోకి నీరు తరలిస్తే బాగుం టుందని రైతులు కోరుతున్నారు.

హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం



హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు

హుజూరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నూతన కార్యవర్గం ఎన్నిక పట్టణంలోని మధువని గార్డెన్‌లో బుధవారం జరిగింది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా కాయిత రాములు, ప్రధాన కార్యదర్శిగా కామని రవీందర్, ఉపాధ్యక్షులుగా పిల్లల సతీష్‌కుమార్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సాయిలు, చందు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజ్‌కుమార్, కోశాధికారిగా స్వామి, కార్యవర్గ సభ్యులుగా హర్షిల్ అజీమ్, రాజు, కిరణ్‌కుమార్, రజినీకాంత్, అబ్దుల్ ఫహీం, రాజలింగం, సంపత్, సుదర్శన్, దేవేందర్, శ్రీనివాసులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్, కొయ్యడ చంద్రశేఖర్, రవీందర్, మహేంద్రాచారి, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

రూ.7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7150 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 12మంది రైతులు 138క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు 12క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వారా గరిష్ఠ ధర రూ.7150, కనిష్ఠ ధర రూ.5200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

జమ్మికుంట రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలోని ప్రభుత్వపాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి పర్లపల్లి నాగరాజు బుధవారం పరీక్ష ప్యాడ్లు, స్కేళ్లు, పెన్నులు పంపిణీ చేశారు.

నేటి నుంచి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

రామడుగు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావు పేట గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారంనుంచి ప్రారంభం కానున్నాయి. 13న ఉదయంనుంచి ఉత్సవాలు ప్రారంభంకాగా 18నరథోత్సవ కార్యక్రమంతో ముగు స్తాయని నిర్వాహకులు తెలిపారు.

గర్షకుర్తిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు..

గంగాధర: గర్షకుర్తి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం నాల్గోరోజు వేములవాడ బ్రాహ్మణులు, భాష్యం శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో సదస్యం, వేదగోష్టి, హవణం, బలిహరణం నిర్వహించారు. ఈసందర్భంగా బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

తిమ్మాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో మహనీయుల విగ్రహాల ముసుగును తొలగించి ఆవిష్కరించాలని డిమాండ్‌చేస్తూ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం పలు సంఘాల నాయకులు సందర్శించి మద్దతు ప్రకటించారు. విగ్రహాలకు ముసుగులువేసి అటు మహనీయులను, ఇటు మండల ప్రజలను అవమానపరుస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జేఏసీకమిటీ నాయకులు మాతంగి శంకర్, వంతపడుపుల శంకర్, పారునంది జలపతి, మురళి, మాజీ వైస్‌ఎంపీపీ ల్యాగలవీరారెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎడ్ల జోగిరెడ్డి, ఎలుక ఆంజనేయులు, మేడిఅంజయ్య నాయకులు పాల్గొన్నారు.

ఆర్చి నిర్మాణానికి భూమిపూజ

మానకొండూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లి గ్రామంలో గల భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ (కమాన్) ఆర్చి నిర్మాణానికి మండలంలోని వన్నారం గ్రామ ప్రధానముఖద్వారం వద్ద బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఆర్చి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలను గ్రామస్థులు విరాళాల రూపంలో అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

రామడుగు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచాల గ్రామంలోని ప్రశాంతినిలయంలో ఉన్న విద్యార్థులకు మ్యాక్స్ ఫౌండేషన్ సభ్యులు బుధవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

నేటి నుంచి ఈకేవైసీ మేళా

హుజూరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న గ్యాస్ రాయితీ పొందేందుకు ఈనెల 13నుంచి 31 వరకు ఈకేవైసీ మేళా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఎల్పీజీ డీలర్ల అధికారప్రతినిధి పీవీ మదన్‌మోహన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హుజూరాబాద్, జమ్మికుంట పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఇండేన్ గ్యాస్ వినియోగదారులు హుజూరాబాద్ అంబుజా గ్యాస్‌ఏజన్సీ కార్యాలయంలో ఈకేవైసీ చేసుకోవాలని తెలిపారు. వినియోగదారులు తమ ఆధార్ కార్డు, గ్యాస్‌పేపర్ జిరాక్స్ తీసుకువచ్చి ఈకేవైసీ చేసుకోవాలని కోరారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం

హుజూరాబాద్‌రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వేసవిలో నాణ్యమైన విద్యుత్తు సరఫరానే లక్ష్యంగా పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్తున్నామని కరీంనగర్ ఎస్ఈ రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దపాపయ్యపల్లి, కందుగుల గ్రామాల్లోని విద్యుత్తు ఉపకేంద్రాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యుత్తు అంతరాయాలను తగ్గించేందుకు బంచ్డ్ ఫీడర్లను వేరు చేస్తూ 33/11కేవీ కందుగుల ఉపకేంద్రంలో కొత్త11కేవీ వీసీబీని ఎస్ఈ/ఓపీ/కేఎన్ఆర్ ద్వారా చార్జ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ లక్ష్మారెడ్డి, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ సంతోష్ ఉన్నారు.

పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

హుజూరాబాద్‌రూరల్/వీణవంక/ఇల్లందకుంట,మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల హయాంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లు లను ప్రభుత్వం క్లియర్ చేయాలని బుధవారం మాజీసర్పంచ్‌లు అసెంబ్లీకి తరలి వెళ్తున్నారన్న సమాచారం మేరకు మండలంలోని ఆయాగ్రామాల సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కుతరలించారు. పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు బింగి కరుణాకర్, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, తిరుమల తిరుపతి, నిరోషా కిరణ్ వీణవంకలో పోలు సదయ్య, నేదురి శ్రీనివాస్, పోలు సమ్మయ్య, పోలు కనుకయ్య, కోడిపల్లి సదానందం తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో కష్టపడ్డ వారికే పదవులు

మానకొండూర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో కష్టపడ్డ వారికే పదవులు దక్కుతాయని డీసీసీ ప్రధానకార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్ అన్నారు. మానకొండూర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ఏడాది కాంగ్రెస్‌పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నాడని అలాంటి వ్యక్తిపై బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు.

కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, రామిడి తిరుమల్‌రెడ్డి, తదితరులున్నారు.

మార్కెట్ కమిటీ సమావేశంలో ప్రొటోకాల్ లొల్లి

జమ్మికుంట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయమార్కెట్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో తన ఫొటో ఎందుకు పెట్టలేదని మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బుధవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కమిటీ నూతన పాలకవర్గం మొదటిసమావేశం చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న అధ్యక్షతన జరిగింది. వైస్‌చైర్మన్ మాట్లాడుతూ ప్రొటోకాల్ ప్రకారం ఫ్లెక్సీపై తనఫొటో పెట్టాలని కోరాడు. చైర్‌పర్సన్ స్పందిస్తూ తాము అన్నీ ప్రొటోకాల్ ప్రకారమే చేస్తున్నామని చెప్పారు. దీంతో ఇద్దరి మధ్య కాస్త మాటమాట పెరిగింది. కొంతమంది సభ్యులు వైస్ చైర్మన్‌కు మద్దతు తెలిపారు. తాము ప్రొటోకాల్ ప్రకారం నడుచుకుంటామని చైర్‌పర్సన్ సున్నితంగా తిరస్కరించారు. అనంతరం అభివృద్ధి పనులపై చర్చించి తీర్మాణం ఆమోదించారు.

సహకార సంఘ భవనాన్ని ప్రారంభించిన చైర్మన్

వీణవంక, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం కొత్తగా నిర్మించిన ప్రాథమిక సహకారసంఘభవనాన్ని చైర్మన్ మావురపు విజయ భాస్కర్‌రెడ్డి డైరెక్టర్లతో కలిసి ప్రారంభించారు. కాగా అధికారపార్టీ నాయకులు, సహకారసంఘ అధికారులకు తెలవకుండా ప్రారంభించినట్లు సమాచారం. కార్యక్రమంలోడైరెక్టర్లు కామిడికావ్య, మద్దురి సమ్మిరెడ్డి, కొలిపాకతిరుమల్,మల్లయ్య, తదితరులున్నారు.